నాగలి

హృదయంలోని కల్మషాన్ని ఈవలావలికి త్రోసివేసి, దాగిఉన్న సౌందర్యాన్ని బయటపెట్టే మంచి పాటలా నాగలి సాగిపోతూంది. సారింప బడి శ్రుతిస్వరాలు హాయిమంటూ పలుకుతూఉన్న వీణతీగెలులా ఆపొలంలో నాగేటిచాళ్ళు ప్రత్యక్షమవుతూ ఉన్నవి. తెరచాపల్లా, ఆకాశంలో చొచ్చుకు పొయ్యే పక్షిరెక్కల్లా, తెల్లటి ఆ దుక్కిటెద్దులు రెండూ ముందుకు నడుస్తూ ఉన్నవి శిష్యుని మనస్సు వ్యవసాయం చేసే పూజ్యమైన గురువులా, రైతు నాగలి వెనకాలే కొరడాతో ఎద్దులను అదలిస్తూ తోలుతూ ఉన్నాడు. గట్టు మీద కూర్చొని తన చిత్రలేఖన పుస్తకంలో ఆ పొలం పొలం వెనకాల కొండలు, కొండలపైన మేఘాలు, ఆకాశాన్ని, ఆ మబ్బుల్ని, ఆ కొండల్ని అంచుల్ని ఎరుపురంగులు చిత్రిస్తూన్న అరుణ కిరణాల్ని, చెట్లని, పక్షుల్ని శ్యామలరావు కుంచెతో బొమ్మవేస్తున్నాడు. శ్యామలరావు లోగొంతుకలో ఒకపాట పాడుకుంటున్నాడు.

"తల్లి పెదవుల నృత్యదర్శన మ్మయ్యేటి
నవ్వులే తెల్లన్ని పువ్వులే దేవి!
తళతళా కన్నులా మెలయించుకొంతులే
నాగేటిచాలులో నవ్యాంకురము దేవి!"

అలుముకుంటూ ఉన్న చీకట్లో ఎద్దులను విప్పుతూ ఉన్న రైతును చూసి శ్యామలరావు మళ్ళీ మళ్ళీ ఆ చరణాల్నే పాడుకుంటూ తన రంగుల పెట్టె, చిత్రలేఖన పుస్తకమూ సర్దుకొని తన స్నేహితుని యిల్లు చేరు కున్నాడు. అయిదు అడుగుల ఎనిమిది అంగుళాల మనిషి. కొంచెంవంగి గుమ్మందాటి ఆపర్ణశాలలోని ముందరహాలులోకి అడుగుపెట్టేటప్పటికి "హల్లో శ్యామ్! చీకటయ్యేదాకా చిత్రిస్తూ ఉన్నావే! అంతసౌందర్యవంతమయిన వస్తువు ఏం కనపడిందయ్యా!" అంటూ వదులు జడను వేసుకుంటూ

ఉన్న స్వర్ణకుమారిదేవి తడిక చాటున ఉన్న గదిలోంచి చక్కా వచ్చింది శ్యామలరావు స్వర్ణకుమారిని చూసి పెదవుల్ని ప్రసరించే చిరునవ్వు హరికేన్ దీపపు వెలుగులో కలిసిపోతూండగా, ప్రేమకాంతులు కళ్ళల్లో తొణికిసలాడుతూండగా.—

"అనేక వేల సంవత్సరాలనుంచి ఉన్న పురాతన విషయమే చిత్రిస్తూ ఉన్నాను—మీ పొలం దున్నడమే !"

"వ్యవసాయం మనస్సుని పాతేస్తుంది, మెదడును కట్టి బారుస్తుంది — అంటావే ! వ్యవసాయపు దృశ్యాలు, చిత్రలేఖనపు విషయాలు యెట్లా అవుతాయయ్యా ? వ్యవసాయంలో రసస్వరూపం ఉందా మరి?"

"వస్తువులో మొరకుతనం ఉండవచ్చుగాక ! వస్తువు తుచ్ఛమైంది కావచ్చుగాక ! ఆ వస్తువు కళా వస్తువు కాగూడదనే ధర్మం ఎక్కడ?"

"సుభావ ప్రసన్నమైన వస్తువే కళావస్తువు అవుతుందని వాదిస్తావుగా!"

"ఒక నీచవస్తువు ప్రత్యేకార్థమును ఉత్తమమైన భావంలో ఈయలేకపోవచ్చునుగాని, ఆ వస్తువు ఇతర విషయముల సంబంధంచేత ఉత్తమభావపూరితము కావచ్చుకాదా సొన్నసానీ !"

"నన్ను సొన్నసానీ గిన్నసానీ అని పిలవకు! నాకు ఒళ్ళుమండిపోయే కోపంవస్తుంది. పూర్ణమైన పేరుపెట్టి పిలవరాదూ ?"

"ఏదో కోపం మనస్సులో ఉంచుకొని, గాన మాధుర్యమైన పేరుతో పిలిస్తే కోపం ఎందుకు స్వర్ణసానీ !"

"ఛీ! నీతో మాట్లాడడం బుద్ధితక్కువ. నీకు మా వ్యవసాయం ఇష్టంలేకపోతే, నాకెందుకు కోపం? అదుగో మా అన్నయ్య వస్తున్నాడు."

ఇంతట్లో స్వర్ణకుమారి అన్నగారు శ్రీనివాసరావు గుమ్మందగ్గిర తల వంచి లోపలికి వచ్చినాడు.

3) శై

"ఏమిటి పిల్లకాయలిద్దరూ దెబ్బలాడుకుంటున్నారు? బుద్ధి తక్కువ! కోపం అంటున్నావేమిటి, చెల్లీ ?"

"ఈ స్నేహితుడుగారి మాటలు నీకు పథ్యం. నేను బుద్ధి తక్కువ దాన్నని అందరికీ తెలియనేతెలుసు. అదే అంటున్నాను !"

అని స్వర్ణకుమారి విసవిస లోపలికి వెళ్ళిపోయింది.

"ఆడవాళ్ళకి కోపం కూడా అందమేనోయ్,"

అన్నాడు శామలరావు, నవ్వుతూను.

"విన్నావా సోన్, శ్యామం అనేమాట! కుక్కరులో భోజనం అంతా ఉడికిందో లేదో చూశావా, లేదా ? బొమ్మలతో కడుపు నిండిన శ్యామానికి అన్నంకావాలో అక్కరలేదో కాని వ్యవసాయ దారుణ్ణయిన నాకు వృకోదరత్వం అలవడింది. మొక్కపాతే కాలంలో స్నానంచేసి వస్తున్నాను" అని శ్రీనివాసరావు స్నానాలగదిలోకి వెళ్ళిపోయాడు.

"ఇదో క్రొత్త కవిత్వ రకపు వ్యవసాయదారుల భాషలా ఉందే" అంటూ శ్యామలరావు కాళ్ళు చేతులు కడుక్కునేందుకు దొడ్లోకి వెళ్ళాడు.

2

కుంతలూరు గ్రామానికి పదిమైళ్ళ దూరంలో రెండు కొండల మధ్య ప్రవహించే ఒక వాగుకి పెద్ద ఆనకట్టకట్టి బ్రహ్మాండమైన చెరువు నిండించారు ప్రభుత్వంవారు. ఆ చెరువుక్రింద ఒక వెయ్యి ఎకరాల భూమి మాగాణీ మొదలైన సాగుకావడానికి నీళ్ళున్నవి. ఆ భూమి అంతా అడివిలా ఉండే రోజుల్లో ఇంగ్లీషు విద్యాపండితులైన యువకులనేకులు నిరుద్యోగపుసైతాను పాలనుపడి ఉండేవాళ్ళకి ఆ భూమంతా పంచి యివ్వవలెనని అలజడిపుట్టింది. ప్రభుత్వంవారు మొట్టమొదట నూరుఎకరాలు పదిమంది పట్టభద్రులకు పంచి యిచ్చేటట్టున్నూ, వ్యవసాయం పెట్టుబడికిగాను ఒక్కొక్కరికి అయిదేసి వందలరూపాయలు అప్పు ఇచ్చేటట్లును, భూమి హక్కు పది ఏళ్ళవరకు ప్రభుత్వంవారికే ఉండేటట్లును, చివర అయిదు సంవత్సరాలు నూటికి పది

రూపాయలవంతున పన్ను యిచ్చేటట్లును, అత్యావన్న సొమ్ము యావత్తూ పది యేళ్ళల్లో తీర్చుకొనేటట్లున్ను మొదలైన షరతులతో భూమి యిచ్చునట్లు ఏర్పాటు చేశారు. దేహదారుఢ్యము, మనోదారుఢ్యము, కూర్చుకొన్న పది మందిని వేలకొలది వచ్చిన అభ్యర్థులలో ఏరుకున్నారు. అందులో శ్రీనివాస రావూ, శ్యామలరావు కాశీ విశ్వవిద్యాలయంలో సహాధ్యాయులు. ఎమ్.ఎస్.సి. పట్టాలు పొందిన తరువాత వారిద్దరూ విడిపోయినారు. తనలో ఉండే లలిత కళాచతురత్వాన్ని పైకి మొలిపించి విజృంభింప జేయడానికి ప్రసిద్ధి కెక్కిన శాంతినికేతన లలిత కళాశాలకు శ్రీ నందలాలు మహాశిల్పి పాదాలు పూజింప పోయినాడు శ్యామలరావు. నాలుగేళ్ళు అయిన తర్వాత చిత్రకళాకోవిదుడై అనేక ప్రదర్శనాలలో బహుమతీలంది ఆతడు ఆంధ్ర దేశోన్ముఖుడైనాడు. చిన్నతనాన్నించి సహాధ్యాయుడైన శ్రీనివాసరావు చెల్లెలు స్వర్ణకుమారిని తన హృదయ సింహాసనంలో అధివసింప జేసుకున్నాడు. స్నేహితు లిద్దరి కన్నా అయిదేండ్లు చిన్నదైన ఆ బాలిక వీరిద్దరూ ఎమ్. ఎస్. సి. కాశీలో చదివే రోజుల్లో వారితోపాటే మకాంవేసి ఇంటర్ చదువుతూ ఉండేది.

స్వర్ణకుమారి ఏడాదిక్రిందనే బి. ఏ. పూర్తిచేసుకుని అన్నగారి వ్యవసాయంలో సాయం చేయడానికి తలిదండ్రుల అనుమతిమీద కుంతలూరు గ్రామంలో ఉన్న నూత్న వ్యవసాయాశ్రమానికి చేరుకుంది. అప్పుడామెకు పందొమ్మిదేళ్ళు. నవయౌవని. దివ్యసుందరి. అలాంటి స్వర్ణకుమారిని మంచి ముహూర్తంలో వివాహం చేసుకుని తన లలితకళకు వన్నెలుదిద్ది, తన జీవితం దివ్యానందపూరితం చేసుకుందామని శ్యామలరావు ఉవ్విళ్ళూరుతుండడంచేత ఇంటికి వెళ్ళగానే తల్లిగారి హృదయం చల్లబడేటట్లు వారం రోజులయినా ఉండకుండానే శ్యామలరావు కుంతలూరుకు ప్రయాణమయ్యాడు. శ్యామలరావు అంటే స్వర్ణకుమారికి చిన్నతనంలోనే అయిదేళ్ళ బాలికగా ఉన్నప్పటి నుంచీ ప్రేమే. తియ్యని సుందరమైన ఆతని గొంతుక విన్నా, గురుశిక్షణ లేకపోయినా అందాలు సేకరించుకోబోయే ఆతని చిత్రలేఖనాలు చూసినా ఆమె గుండె మధురంగా కొట్టుకొనేది. చదువుకునే రోజుల్లోను, శలవురోజు

ల్లోను, తన ఊళ్లో ఉన్న ప్రసిద్ధికెక్కిన ఒక గాయకునిచేత ఆమె వీణపాట చెప్పించుకొన్నది. శ్యామలుని కళకు తన వీణ దివ్యార్పణగా సంకల్పించు కున్న దా బాలిక.

శ్రీనివాసరావుకి చిన్నతనాన్నుంచి వ్యవసాయం అంటే మహా ఇష్టం. పాతబడి నష్టదాయకమైన వ్యవసాయపు రీతులన్నీ నెమ్మది నెమ్మదిగా మార్చి శాస్త్రపరిశోధనా పూర్వకమైన మంచి పంటలు పండించే కొత్తమార్గాలు అవ లంబించాలని అతని వాదన. కొద్ది రైతాంగమైన తండ్రిగారి కర్షకత్వానికి అనేక మార్పులు తీసుకువచ్చి, వీలైనప్పుడల్లా శ్రీనివాసరావు చక్కని వ్యవ సాయపు పద్ధతులు ప్రవేశపెట్టించాడు. ఉద్యోగం లేకుండా వీధుల వెంబడి తిరుగుతూ, లోకాన్ని తిట్టుకుంటూ జమీందారుల్నీ ధనాఢ్యుల్నీ పేరు తల్చు కుని పళ్ళు కొరుకుతూంటే చదువుకున్న వాళ్ళంతా తిరిగి వ్యవసాయంలోకి చేరిననాడే భరతదేశం బాగుపడుతుందని ఛాతీ విస్ఫారితంచేసి కళ్ళల్లో కాంతులు ప్రసరిస్తుండగా శ్రీనివాసరావు వాదిస్తూంటాడు.

ఈ విషయంలోనే శ్రీనివాసరావుకీ, శ్యామలరావుకీ భేదాభిప్రాయాలు కలిగాయి. నేల దున్నుకోడానికి మెదడు దున్నుకోడానికి ఉత్తరపు ధ్రువా నికీ, దక్షిణపు ధ్రువానికీ ఉండే తేడా ఉంది అంటాడు శ్యామలరావు. ఒక దాని కొకటి సంబంధం ఉంటే ఒక దాని సహాయంవల్ల యింకొకటి విజృంభి స్తుందని శ్రీనివాసరావు వాదిస్తాడు. అన్నగారి వాదన దిట్టంగా బలపరుస్తుంది స్వర్ణకుమారి. ఏ 'యల్. టి' పట్టానో చేతిలో పుచ్చుకొని "మేష్టరీపని మేష్టరీపని" అని దేశాలు తిరగడంకన్న భారతనారీమణి ఎంత చదువుకున్నా భర్తకు సహాయంగా వ్యవసాయవృత్తే అవలంభించాలని తన తియ్యటి గొంతుకతో చక్కగా వాదిస్తుంది.

ఆ కారణంచేతనే పట్టభద్రురాలు కాగానే, నాగలి పట్టుకున్న అన్న గారికి అన్నం పట్టుకెళ్ళే ఆడబడచు అయ్యింది. అన్నగారి పది ఎకరాల భూమిలోను ఒక ఎకరం తన స్వంత సేద్యానికి ఉంచుకుంది. రాత్రింబవళ్లు కష్టపడి ఆ ఎకరంభూమి, పూలచెట్లతోను కూరగాయల మొక్కల పాదుల

తోను, పండ్ల అంటులతోను, తిరిగి అమ్మేందుకు మొక్కలున్న కుండల తోను నింపివేసింది.

3

తనకూ, స్వర్ణకుమారికీ జరిగిన వాదనను గూర్చి ఆలోచించుకుంటూ భోజనందగ్గిరికి వచ్చికూర్చున్నాడు శ్యామలరావు. వచ్చిన వారంరోజులనుంచి ఎప్పుడూ పాటలు పాడుతూ తాను నవ్వుతూ, యితరులను నవిస్తూండే శ్యామలరావు చప్పగా చల్లగా భోజనంవగ్గర కూర్చుని తనవేపైనా చూడ కుండా తలవాల్చుకొని ఉండడం స్వర్ణకుమారి చూసింది. ఆమె హృదయం ద్రవించిపోయింది. ఒత్తయిన జుట్టుతో వికసించివున్న అందమైన ఆతని తలను తనహృదయానికి అదుముకుని "నీమీద నా కెప్పుడూ కోపంకలగదు శ్యామం! నీ భావాలకు తీరని విచారమేకాని" అని అందామని ఆమెకు గాఢమయిన కాంక్ష కలిగింది.

"నా మాటలకు కోపం వచ్చిందా యేమిటి. భోజనం తిన్నగా చెయ్యడంలేదు, శ్యామ్" అని స్వర్ణ అన్నది.

"నీ మాటలకు కోపం ఎందుకు స్వర్ణా? గంగాకూలంలోని వెన్నెల లాంటి నీ హృదయం తల్చుకుంటూ యిక్కడికి వచ్చాను. ఆ వెన్నెలలో ఎప్పుడు తేలిపోదామా అని ఆలోచిస్తున్నానంతే."

స్వర్ణకుమారి కళ్ళల్లో మెరుములు మెరిసినవి. శ్రీనివాసరావు శ్యామల రావుని చూసి—

"ఒరే శ్యామ్! నేను ఇంజనీరుతో మాట్లాడి ఏర్పాటుచేసి ఉంచాను. నువ్వు దరఖాస్తు పెట్టగానే నీ పది ఎకరాలు నీకు యిస్తారు. నువ్వు వ్యవ సాయం ప్రారంభించగానే నిజమయిన భాగస్వామిని అవుతూ నీ గృహిణి నీ యింటికి అవతరిస్తుందని ఓ తాయిలంగారు నీతో చెప్పమన్నారు" అని అన్నాడు.

శ్యామలరావు మాట్లాడలేదు. అన్నగారి మాటలకు చిరునవ్వు నవ్వుకుంటూ ఉన్న స్వర్ణకుమారి శ్యామలుని మౌనానికి నివ్వెరపోయి చూచింది.

భోజనాలయి కూర్చున్నారు. శ్యామలరావు సిగరెట్టు, శ్రీనివాసరావు చుట్ట కాల్చుకుంటూండగా స్వర్ణకుమారి తన తోటలో తయారైన తమలపాకులురాసి చుడుతూంది. శ్యామలరావు తలవంచుకునే, "శీనూ! వ్యవసాయం చేయడం నాకిష్టంలేదు. చదువుకూ, వ్యవసాయానికి సంబంధం లేదని నేను మొదటినుంచి వాదిస్తున్నాను. శ్రీనివాసరావు ఒకడు తప్పబుట్టవచ్చుగాక! తక్కినవాళ్ళంతా కొద్దిరోజుల్లో నిజం గుర్తెరిగి నాగళ్ళ నడమధ్యాన వదలి స్వగ్రామాలకి వేంచేస్తారని నా గట్టి నమ్మకం. వ్యవసాయం చేసేవాళ్ళు వేరు; చదువుకున్న వాళ్లు పరిశోధనలు చేసి శాస్త్ర పరిశోధనకు కొత్త అధ్యాయాలు చేర్చాలి. కళాదేవిని నూత్నపంథాలలో నడపాలి. ఆమెకి నూత్నాలంకారాలు సమకూర్చాలి. అదీ నా ఉద్దేశ్యం. స్వర్ణకు ఈ వ్యవసాయంవల్ల అద్భుతమైన అందంపోయి కర్కశమైన అఘోరకపు అందం వచ్చింది. అయితేయేమి? తెలిసున్నవాడవు నువ్వైనా ఆమెకి బోధించి, నావెంట పంపు. నేను బెజవాడలో ఒక లలిత కళాశాలను యేర్పాటు చెయ్యదల్చుకున్నాను. వెన్నెల కిరణాల్లా ప్రసరిస్తూ వీణతీగెల్లోంచి దివ్య గాంధర్వాన్ని ఉద్భవింపజేసే ఆమెవేళ్ళు మొరటుబారి యెల్లా ఉన్నాయో చూడు! ఇంటికి రాగానే మీ నాన్నగారు ముహూర్తం పెట్టిస్తామన్నారు" అని అన్నాడు. ఈ మాటలు వింటూన్నకొద్దీ స్వర్ణకుమారికి మొహం జేవురించింది. చేతులు వణికినవి.

"అన్నయ్యా! శ్యామలరావు యిక్కడ వ్యవసాయం చెయ్యనక్కరలేదు. స్వర్ణకుమారి పెళ్ళి చేసుకోకుండానే అన్నగారికి సహాయం చేస్తూ యిక్కడే వుంటుందని చెప్పు. రేపు రెండెడ్లబండి రైలుకు మీ శ్యామలరావుని తీసుకువెళ్ళే యేర్పాటు చేయించు" అని కళ్ళనీళ్ళు తుడ్చుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

4

ఈ నూతన కర్షకాలయంలో ఒక వివాహంకాని యువకుడు ఉన్నాడు. పూపుత్రిలాఉండే స్వర్ణకుమారి, నిజమైన బంగారుప్రోవని ఆతని నమ్మకం. తన యింట మహారాణిలా ఆమెకు అధికారం ఇవ్వడానికి అతడు ఆశిస్తున్నాడు. ఈ రెండేళ్ళనుంచి తన హృదయ దుర్గానికి ముట్టడివేస్తూన్న ఈ వీరుణ్ని దూర దూరంగానే ఉంచింది స్వర్ణకుమారి. ఈనాడు శ్యామం తన్ను నట్టేటిలో వదలి వెళ్ళిపోయినట్లు ఆమెకు తోచింది. దివ్యమూర్తి అనుకున్న తన శ్యామం యింక తనవాడెట్లా అవుతాడు? తన హృదయం గ్రహించలేనివాడు తనకు కాదన్నట్లే ప్రేమ అనేది ఉట్టి మాయ. అది మనుష్యులకు ఉండే హృదయ దౌర్బల్యంగాని, ఉత్తమగుణం కానేకాదు. ఆశయాలకు అందలేని ప్రేమ తుచ్ఛమే అవుతుంది. వ్యవసాయంచేస్తూ తన అన్నగారితోబాటు నడుం కట్టుకున్న ఆ ఆశ్రమవాసి నిజమైన వీరుడు. అతన్ని తనకు స్వామిగా చేసుకుంటే అంతకన్న పవిత్రమయిన త్యాగం ఇంకొకటిలేదు. తన హృదయవనంలో శ్యామలరావు విషపుమొక్క అయిపోయినాడు. ఆ మొక్కను కలుపుకింద తీసివెయ్యవలసిందేకదా! కళ్ళనీళ్లు పెట్టుకుంటూ, నిద్రలేకుండా పక్కమీద దొర్లుతూ రాత్రంతా స్వర్ణకుమారి జాగరం చేసింది.

తెల్లవారగట్లే శ్రీనివాసరావు చెల్లెలి గదిలోకి వచ్చి చూసేటప్పటికి వడిలిపోయిన పువ్వులా ఉన్న తన ముఖం అన్నగారివైపు త్రిప్పి, స్వర్ణ,

"తోటలోకి వెళ్ళే వేళ అయిందా అన్నయ్యా ?" అని ప్రశ్నించింది.

"చెల్లీ! నిన్ను చూసి మరీ వెళ్ళమన్నా. శ్యామం బండెక్కి వెళ్ళిపోయినాడు. ప్రాణంలేని కట్టెలా ఉన్నాడు. మనస్సులో ఉండే ఆవేశాలవల్ల వచ్చే మాటలకు అర్థంలేదు. ప్రేమ అంటే భగవంతునియొక్క అవతారం అని నా నమ్మకం చెల్లీ! అలాంటి ప్రేమను చేతులార త్రోసిపుచ్చుకోడం మన దేవాలయం మనమే మన నెత్తిమీద కూలద్రోసుకున్నట్లవుతుంది. నిన్ను విడిచిపెట్టి శ్యామం నిజంగా ప్రాణం విడుస్తాడేమోనని భయం

వేస్తోంది. ఎప్పటికైనా భార్య భర్త ననుసరించవలసిందేకదా చెల్లీ! నేను శ్యామానికి ఉత్తరం వ్రాస్తాను. నిన్ను యింటికి తీసుకువెళ్ళి దిగ బెడతాను."

"అన్నయ్యా! నన్ను ఇంటి దగ్గిర దిగవెట్టే దారిలోనే ప్రాణాలూ దిగబడతాయి."

"అంత వెఱ్ఱితనం ఉండకూడదు తల్లీ!"

"నాకు వెఱ్ఱితనమా? నీకా?"

కళ్ళనీళ్ళు కుక్కుకుంటూ స్వర్ణకుమారి దిండులోకి ముఖందూర్చి వెక్కి వెక్కి ఏడవడం ప్రారంభించింది. మంచంమీద పక్కనే కూర్చుని శ్రీనివాసరావు చెల్లెల వీపు నిమురుతూ,

"చెల్లీ: నేను పొలంలోకి వెడుతున్నాను! తోటపని చూసుకో! ప్రయాణాల మాటలులేవు. అన్నమాటలు ఉఫ్న ఊదేస్తున్నాను" అని అన్నాడు.

చెల్లెలివైపు పది నిమిషాలుచూసి తల ఊపుకుని పెదవి విరుచుకొని నెమ్మదిగా అడుగులు లెక్కపెట్టుకుంటూ వెళ్ళిపోయినాడు.

5

స్నేహితుడైన శ్యామ్‌ని ఎల్లా ఒప్పించగలడు? చెల్లెలి మనస్సు ఎల్లా తిప్పగలడు? చిన్నతనాన్నుంచీ వీళ్ళిద్దరి దాంపత్యమూ అతని ఊహాపథంలో ఎంతో ఆనందం సమకూరుస్తూ ఉండేది. శ్యామసుందరంమీద శ్రీనివాస రావుకు వెఱ్ఱి కోపం వచ్చింది. ఆడవాళ్ళ హృదయాలు ఎంతకాలం మగ వాళ్ళ చేతుల్లో నలిపేస్తారు? పురుషుల ఆశయాలకూ, ఆశలకు, కాంక్షలకూ బానిసలై ఆడవాళ్ళు యెంతకాలం తుచ్ఛ జీవితాలు గడుపుతూ ఉండాలి?

తన కింతవరకు ఏ బాలికపైనా ప్రేమ ఉద్భవించలేదు. అట్టి ప్రేమ నిధానమైన బాలిక తన్ను వ్యవసాయం మానివేయమంటే మానివేయవల

సిందేనా? అవును. అలాంటి దివ్యబాలిక తన్ను మానివేయమంటే తలవంచి ఒప్పుకోవలసిందే!

ఈ ఆలోచనలతో శ్రీనివాసరావు పరధ్యానంగా వ్యవసాయం సాగించాడు. ఆయన పరధ్యానం పెద్దపాలి చూసి "ఏమండి అయ్యగారూ! ఈవాల అదేంటోగా ఉన్నారు?" అన్నాడు.

"అదీలేదు, ఇదీలేదు, పొలం దున్నటం ఈవాళ పూర్తి చెయ్యాలి సోమన్నా."

"మీ అలక నిద్రపోతోందండి బాబూ!"

"నా నిద్రే ఎద్దులలో ప్రతిఫలిస్తోంది సోమాలూ!"

రెండవ భాగము

నెలలు గడిచాయి. శ్యామ్ దగ్గరనుంచి స్వర్ణకుగాని, శ్రీనివాసంకు గాని ఉత్తరంలేమ. స్వర్ణ ఇంతవరకు శ్యామ్ తనకు వ్రాసిన ఉత్తరాలన్నీ తిరిగి చదువుకుంది. ఆ భాషా మాధుర్యమూ, ఆ చిత్రవిచిత్ర భావాలూ ఆమె హృదయాన్ని దహించి వేశాయి. నిజంగా తన శ్యామ్ తనకు దూరమై పోతాడా? అతణ్ని మళ్ళీ చూడడమే పడదా! 'నిన్ను సర్వకాలాలయందూ హృదయంలో అధివసింప చేసుకుని పూజిస్తూ ఉంటాను' అనే వ్రాతలు మాటలూ వట్టి గాలి కబుర్లేనా! ఛీ దొంగస్నేహాలూ దొంగప్రేమలూ ఎవరిక్కావాలి? అతడు శాంతినికేతనంలో ఉన్నప్పుడు కాశీలో ఉన్న తనకడకు రాని నెలలేదు. తనకు శలవలు వచ్చేటప్పటికి శాంతినికేతనాన్నుంచి మహా వాయువులా తనకడకు చేరుకుని శ్యామం తన్ను ఎంత ప్రేమతో అజంతా మొదలైన దివ్య కళాక్షేత్రాలకు తీసుకొని వెళ్ళేవాడు. అలాంటి ఆ ప్రేమికుడు తనకు ఇంక కానివాడేనా? తన ఆశయాలనూ తన్నూ ఎంత గౌరవిస్తున్నాడు, ఈ సుబ్రహ్మణ్యం! వెఱ్ఱి మొఱ్ఱి బొమ్మలూ వెఱ్ఱి మొఱ్ఱి కవిత్వమూ సృష్టింపలేకపోతే మనుష్యుడు కాడా ఏమిటి?

తన అన్నగారు కవా? గాయకుడా? చిత్రకారుడా?

*　　*　　*

ప్రతివ్యక్తి జీవితంలోనూ ఎవరో ఒకరు ప్రవేశించి ఆ జీవితాన్ని సర్వవిధాల భగ్నంచేస్తారు. ఎవరు ఈ శ్యామ్ ఎవరు తాను!

"స్వర్ణా! నానాటికి చిక్కి శల్యమైపోతున్నావు—నాలుగు రోజుల పాటు యింటికివెళ్ళి అక్కడ విశ్రాంతి తీసుకుని మళ్ళీ రాకూడదూ? అమ్మ చేతి పాకము రుచిచూస్తే మళ్ళీ గులాబి బుగ్గలు వేసుకు రావచ్చుగా?"

"నా వంట బాగాలేదనా? పోనీ నువ్వు తినకు. ఆ ముక్కే మొదట చెప్పలేకపోయావూ!"

"ఇంతట్లో కోపమా? ఎవరివంట వారికి రుచి కాదంటారుగా!"

"అమ్మకు ఎవరు వంటచేసి పెడుతున్నారు? అమ్మ చిక్కిపోయిందా? నా వంట నీకు సహించకపోవచ్చును—వంటవాణ్ణి పెట్టుకో!"

"ఈ మధ్య నీకు మాటలాడితే కోపంవస్తూంది—కోపదేవత వయి పోతున్నావు. నీ వంట నాకు ఎంతో అద్భుతంగా ఉంటుంది చెల్లి! ఇంక శ్యామ్ ఉన్నన్నాళ్ళు ఒకటే పొగిడేవాడు నీ వంటని—"

"శ్యామ్ పేరు నా దగ్గర తీసుకురాకు-ఎంత చెప్పినా నువ్వు శ్యామ్ పక్షమే" అని నీళ్ళురాని ఎఱ్ఱని పొడికళ్ళతో లోపలికి వెళ్ళిపోయింది స్వర్ణ కుమారీదేవి.

శ్యామలరావు వెళ్ళిపోయినప్పటినుంచీ ఆమెకు తోట అంటే భక్తి యెక్కువైంది. ఆమెలో వికసించవలసిన ప్రేమంతా ఆమె పూలవన వాటికలో సర్వవర్ణ స్వరూపాలైన పూవులై వికసించినది. ఆమెలోని ఆశాసాఫల్యత బొప్పాసి పళ్ళయి, నిమ్మపళ్ళయి, దానిమ్మ పళ్ళయి ఫలించి నది. ఆమె తోట కలకలలాడిపోతూన్నది.

ఆ తోట విషయంలో సుబ్రహ్మణ్యము స్వర్ణకుమారికి సైదోడు వాదోడై నాడు. ఆమె మాటే అతనికి రాజశాసనము. ఆమె ఎంత చిన్న కోర్కె కోరినా ఆతడు తన మహద్భాగ్యం క్రింద ఎంచుకొని నిర్వర్తిస్తూ

న్నాడు. తన వ్యవసాయ స్థితి తగ్గిపోతూన్నదని అతడు గమనించటము లేదు. స్వర్ణకుమారికి నానాటికి ఆతడన్న గౌరవము హెచ్చిపోయినది.

2

శ్రీనివాసరావు వ్యవసాయం దినదినాభివృద్ధి పొందుతున్నది. చెల్లెలు వేసిన తోటతోపాటు పక్కనే మరిమూడు ఎకరాలు అన్నిరకములైన ఫల వృక్షములతోనూ నృత్యాలు చేయించినాడు. చెట్లతో ఆడుకుంటాడు. చెట్లతో మాట్లాడుకుంటాడు. ఆతని మాటలువిని చెట్లు తలయెత్తి ఆతని వంక చూచి కిలకిల నవ్వుతవి. కాయలుకాచిన ఆతని చేతులు తల్లి ప్రేమతో చెట్లను స్పృశించుతవి.

తన పదియెకరాల పొలము చుట్టూ కొబ్బరితోట వేసినాడు శ్రీనివాసరావు. ఒక యెకరము చెఱుకు, ఒక యెకరము అరటితోట, ఒక యకరము పాదులతోనిండి సర్వకాలాలయందూ చుట్టుపక్కల పట్టణాల మార్కెట్టులను కూరలతో నింపుతుంది. తక్కిన మూడు యెకరాలూ ధాన్యం పండిస్తాడు. పది బస్తాలు తనకు సహాయంచేసే పాలివానికిపోయి తక్కిన యిరవై తనకూ తన చెల్లెలికి తిండికి మిగులుతున్నవి. తోటలో వచ్చిన రాబడులవల్ల పై ఖర్చులూ కొదవ జీతాలూ వస్తూన్నవి; ప్రభుత్వం వారిచ్చిన బాకీ తీరుతున్నది.

ఓరోజున తోటలో పనిచేసుకుంటున్న శ్రీనివాసరావు దగ్గరకు సుబ్రహ్మణ్యంతల్లి వొచ్చింది.

"శ్రీనివాసరావూ! ఈ ప్రకారంగా వెళ్ళితే పదేళ్ళదాటితే పొలం నీదై పోతుందికదా?"

"మీ ఆశీర్వచనంవల్ల మా పదిమందికీ యీ భూసంపాదన మిగులుతుందనే అనుకుంటున్నాను."

"ఐతే ఓ ప్రశ్న అడుగుతాను తండ్రీ! కోప పడకుంటే నీ కనేక

సంబంధాలు వొస్తున్నవి. ఓ చక్కనమ్మాయిని తీసుకొచ్చి మా కళ్ళ కరువు తీరుద్దూ!"

"మీ అబ్బాయికేమైనా సంబంధం ఆలోచింవారా యేమిటండీ!"

"అందుకనే వొచ్చాను తండ్రీ! నన్నీ రొండేళ్ళనుంచి మావాడు వేపుకుతింటున్నాడు. స్వర్ణకుమారిని శ్యామలరావు కిస్తారు గదా అనే వుద్దేశంతో ఆ మాటెత్తకుండా వూరుకున్నాము. ఇప్పుడలాంటిదేమీ లేదని మా వాడు చెప్తాడు. మంచి ముహూర్తం చూసి ఇవ్వాళ నన్ను కోరి పంపించాడు. మావాడికి మా వూళ్లో ఓ యిరవై యెకరాల భూమి కూడా వుంది. ఆ సంగతి నీకు తెలిసేవుంది. మా చిన్నతనంలో పెద్దలు పెళ్ళికూతుళ్ళనే అడిగేవారు. మీ స్వర్ణను మా సుబ్రహ్మణ్యాని కియ్యవలసిందని, నాయనా, నీ రెండు చేతులు పట్టుకు అడుగుతున్నాను. అమ్మాయి అభిప్రాయం తప్పకుండా కనుక్కో."

"అదికాదండి దొడ్డమ్మగారూ! ఆస్తులకీ దానికీ చూడము. మా చెల్లిలి యిష్టం యెలావుంటే ఆలా మేము తప్పకుండా జరపవలసినవారమే" అని శ్రీనివాసరావు లేచాడు. సుబ్రహ్మణ్యం తల్లి చల్లగా వెనక్కు వెళ్ళి పోయింది.

"శ్యామ్ వుట్టి వెర్రివాడు. వాడు వుట్టిఫూల్, ఇంతప్పటినుంచీ ప్రేమించిన అమ్మాయిని కుక్కిన పేనులాగ కిక్కురు మనకుండా ఇక్కడ వదలివేసి వెళ్ళిపోయాడు. ఇంతైనా వాడికి పౌరుషంలేదు. వాడి ప్రేమ ఒట్టి హుళక్కి. వీళ్ళిద్దరి ప్రేమా చూస్తూ ఎంత ఆనందం పడేవాడు తాను. స్వర్ణ హృదయం వాడేమి తెలుసుకున్నాడు. ఆఁ! కళలట! కళోపాసకుడికి అందరి హృదయాలు తెలుస్తాయంటారు, వట్టి బూటకము. ఈ సుబ్రహ్మణ్యం ఎక్కడ దాపురించాడు బాబూ! ఇంతకూ ఎవరికర్మ వారిది" అనుకుంటూ ఆరడుగుల శ్రీనివాసరావు ఏనుగుగున్నలా విస విస యింటిపైపు నడిచి పోయాడు.

3

శ్రీనివాసరావు యిల్లు తన స్వహస్తాలతో నిర్మించుకున్నాడు. స్వర్ణ దాన్ని అలంకరించింది. తోటమధ్య ఆ యిల్లు మణిపూసలా మెరిసిపోతూన్నది. శ్రీనివాసరావు జీవితంలో ధ్వనిలేదు. అంతా వాచ్యమే. ఏది చెప్పదలచుకున్నా డొంక తిరుగుళ్ళు తిరక్కుండా, మొహమాటం లేకుండా కర్ర విడిచినట్టు చెప్తాడు. కోపమంటే ఎరుగడు. కోపంవస్తే లయకాల రుద్రుడే. అసత్యవాదులంటేనే అతనికి కోపం. అతనంటే అందరికీ భయమూ, భక్తీ కూడాను. అలాంటి శ్రీనివాసరావు ఏదో గొణుక్కుంటూ ఇంటిలో ప్రవేశించాడు. తన పడుకునే గదిలోకివెళ్ళి తక్లిన్నీ యేకులా తీసుకుని వినోబా భావే విధానాలతో త్వరత్వరగా దారం వడకడం ప్రారంభించాడు. ఏ ఆలోచనా తోచనప్పుడాతడు దారం వొడుకుతుంటాడు. తన కట్టుబట్టలన్నీ ఆతడు వొడికినదారమే. "స్వర్ణా స్వర్ణా" అని చెల్లెలిని తన గంభీరకంఠంతో పిలిచాడు. తోటలో చెట్లకు నీళ్ళు పోస్తున్న ఆ బాలిక వనలక్ష్మిలా పరుగెత్తుకు వచ్చింది.

"ఎందు కన్నయ్యా పిలిచావు?"

"పిలిచానమ్మా! చాలా ముఖ్యమైన కారణమే వున్నది. నీకు పెళ్ళి వారు వొచ్చారు—ఇదివరదాకా దూరంగా వున్న వారు యివ్వాళ దగ్గరకు వొచ్చారు, నన్నుద్ధరించటానికి!"

"ఏమిటన్నయ్యా? అలా వున్నావేమిటి? ప్రసన్నంగా వుండే నీనుదురలా ముడితలు పడిపోయిందేమిటి? ఏదో కోపంగా వున్నావు. నాకు పెళ్ళి వొద్దని యిదివరకే నీతో గట్టిగా చెప్పివున్నాను. ఈ భూమంతా నీదైనప్పుడు అప్పుడు చూసుకుందాములే!"

"నా కదంతా తెలియదమ్మాయ్, శ్యామానికీ నీకూ చెడిపోయిందటగా. ఇంక అడగవచ్చునట! ఆ సంగతి వాళ్ళకు తెలిసిందట. తెలిసిందటమ్మా! సుబ్రహ్మణ్యం తల్లి తన కుమారుడికి నీ పాణిగ్రహణంకోరి రాయబారం వొచ్చింది. నీయిష్టం!"

ఇంత విరసంగా తన అన్నగారెప్పుడూ తనతో మాటాడలేదు.

అతడు చెప్పినమాట లామెకు తిన్నగ యెక్కనేలేదు. ఆరునెల్ల క్రింపట శ్యామం తనతో ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఏమయినాడు ? చెవులు అడ్డంపెట్టుకున్నా తన తోటలోని పువ్వులలోనుంచి ఆతనిపాటలు వినవస్తూనే వున్నవి. కళ్ళకు అడ్డంపెట్టుకున్నా నాగలి,నాగేటిచాలు, ఆ దూరాన కొండలూ అతని చిత్రాలను ప్రతిఫలిస్తూనే వున్నవి. తన హృదయంలోని ఆతని విగ్రహము స్పష్టరేఖామూర్తిగా చిరునవ్వులు నవ్వుతునే వున్నది.

తోటపని చేసికొనివచ్చి ఎంత తియ్యగా శ్యామలరావు నవ్వుల్ని కలలుగంటూ వుండేది. ప్రతి పుట్టినరోజుకీ తన కొరక బహూమతి యిచ్చేవాడు. చిత్రాలు, చిత్రవస్తువులు, చీరెలు, కుంకుమ భరిణెలు, వెండివస్తువులు, గంధపు చెక్కడాలు శ్యాము ప్రేమతో అర్పించినవి కావూ?

"నిన్ను పూజిస్తానె స్వర్ణసానీ !
నీవు నా ఆశవే స్వర్ణసానీ !"

అన్న ఆతనిపాట తన నరనరాలలో తీగలు మీటుతున్నది. ప్రత్యూష పవనాలే ఆతని ముంగురులై, సాయం సంధ్యా కిరణాలే ఆతని మాటలై, నిర్మలజ్యోత్స్నలే ఆతని ఆటలై తన జీవితమంతా నిండుకొన్న శ్యామ్ తన చేయివదలి ఒక్కడూ, ఒక్కడూ వెళ్ళిపోయాడు.

తల్లిదండ్రుల అనుమతి అడిగి ఏ సంగతీ చెప్తానని సుబ్రహ్మణ్యము తల్లితో చెప్పమని అన్నగారిని కోరినది స్వర్ణ.

4

శ్యాముకు జీవితమే భగ్నమైనది. స్వప్నాలు శకలములైనవి. ఒంటిగా ఈ బ్రతుకు ఎడారిలో వేడిగాల్పులు వీస్తూ ఉంటే ఇసుకలో కాళ్ళు దిగబడుతూ ఎంతదూరం నడవగలడు తాను? కుంచెలకు చివరవున్న "సేబుల్" వెంట్రుకలలోని ఎర్రటి రంగు ఆకాశమంతా ఎర్రటి మరకలతో నింపింది. గొట్టాలలోని రంగులు కర్రబారినవి. చిత్రలేఖనపు కాగితాలు ఎండి పొడిపొడిగ రాలినవి. ఎప్పుడూ తనకు చెలికత్తెలావున్న అలంకారదేవత మాసిన

చీరకట్టుకొని వివర్ణవదనంతో వెడలిపోయింది.

'ఆనంద మేలనే,
అమృత వీచిక లేల ?
అడు గడుగున తగులు
విడివి ముల్లుల దారి !
ఆనందమేలనే?

కల లేల బ్రతుకులో ?
సెలయేటి ఝరి యేల?
ధూళినిండిన బ్రతుకు
తూళి విరుచుకుపడెనె !

ఆనంద మేలనే ?
అమృతవీచిక లేల?

కారు రంగుల వచ్చు
కల్లోల ఫేనాన
తడిలేని కణమైన
ధావళ్యమే కళలు

ఆనంద మేలనే ?
అమృతవీచిక లేల ?

పరికిణీ కుచ్చులు జారాడగా పరుగెత్తుతూ, మెళ్లో హారాలు గలగలా పాటలు పాడుతూ చిక్కులు పడుతూంటే తనతో ఆడుకున్నప్పుడు చిన్నతనంలో స్వర్ణలోని ఈ కర్కశత్వపు బీజాలు ఎక్కడా కనబడలేదే!

అప్పుడే పయ్యెద సవరించు క్రొన్ననలుతాల్పు నవయౌవనపు తొలి పొద్దులలో ఆమెలోని వినూత్న పరిమళాలు ఈలాటి కటువు వాసనలతో మిశ్రమము కాలేదే! ఆమె అన్నగారు తన ఊరు తన స్నేహ వాంఛకై వచ్చినప్పుడు ఆ బాలిక తనలోని దివ్యసౌందర్యము వికసించే రోజులలో ఏవో కొత్త అందాలు సేకరించుకొనే గాఢ సురభిళ ఘటికలలో తనకై

అన్నతో ఆమె వెన్నంటివచ్చిన శుభముహూర్తాలకు అర్థమే లేదా?

తనకూ, తన స్నేహితుడు శ్రీనికీ వాదాలు మ్రోగిపోయినప్పుడు అన్నగారికి వ్యతిరేకంగా ఆ బాలిక తనపక్షం వహించి వాదించిన తియ్యటి వాదనలకు ప్రయోజనమే లేదా! తన జన్మలో జన్మ, తన ప్రాణములో ప్రాణమూ, ఆత్మలో ఆత్మా ఐన కళను వదలాలా? తన జన్మలో జన్మ, ప్రాణములో ప్రాణమూ, ఆత్మలో ఆత్మ ఐన ప్రేమను వదలాలా?

కళ తన ఆశయమూ నిదానమూ! కళ కోసమే కదా ఉద్యోగ వాంఛ పూర్తిగా నాశనం చేసుకున్నది? ఈ ప్రేమ బాలిక స్వర్ణకుమారి, ఆ కళతో రేఖకు రేఖా, వర్ణానికి వర్ణమూ, మూర్తికి మూర్తీ రూపము పొందినదే. కళవల్ల కళాస్రష్ట లోకానికీ, లోకస్వరూపుడైన భగవంతునికి సేవ చేస్తాడు. ఆ సేవలో కాళాస్రష్ట తన సర్వస్వమూ ఆహూతి చేయవలసి వుంటుంది. అదే మహా యజ్ఞము – ఈ దివ్య త్యాగమే కళను ఉత్కృష్టపథాలకి తేల్చి వేస్తుంది.

ఒక కళావ్యక్తి తన కళవల్ల లోకానికి సేవచేస్తున్నా ననుకోవటము తన్ను తాను మోసం చేసుకోవటం కాదా? కళ లోకానికి సేవ ఔతుందా? కళాకారుడని పేరు వొస్తుంది- అలా పేరు రావడం ఒకని అహంకారానికి అలంకారం ఔతుందిగాని, పూజా స్వరూపము కాగలదా? తాను బూదిలో కలిసిన వెనుక కూడా తన పేరు నిలిచి వుందనే భావము అహంకారానికి అధిస్థితి.

జీవించి వున్నన్నాళ్ళూ కలిగే అనుభవాలే మోక్షస్వరూపాలౌతవి. జీవితానికి ఉత్తమానుభవము ప్రేమ. ప్రేమ కోసం రాజ్యాలు వొదిలి పెట్టారు—ఎనిమిదవ ఎడ్వర్డు మొదలైన చక్రవర్తులు చిన్నతనాన్నుంచి తాను నమ్మిన ఒక బాలిక— తన జీవిత సర్వస్వమూ, తన సౌందర్య సర్వస్వము తనకు అర్పించటానికి సిద్ధంగా వున్న ఒక బాలిక, ఇవ్వాళ తన విషయంలో నిస్పృహచెంది కృశించి పోవలసిందేనా?

ఐతే ఆమె మాత్రం తన ఆశయాలు ప్రేమకోసం ఎందుకు ఆహు

తించకూడదు? యుగయుగాలనుంచీ ఆడవాళ్ళను కాలిక్రింద నేలరాశారు మగవాళ్ళు. వాళ్ళ సర్వస్వమూ భర్తలకోసము ఇదివరదాకా త్యాగాగ్నుల కింధనం పోశారు. దివ్యసౌందర్యవతియైన ఒక బాలికకోసం తనసర్వస్వమూ త్యాగము చేసికోవటములో ఉత్తమత్వ ఉన్నదిగానీ, ఆమెను త్యాగం చేసు కొని రమ్మనటంలో లోకసాధారణగాధే ప్రత్యక్షమౌతున్నది.

తనతో ఆమె ఒంటిగ వాహ్యాళికి, సినిమాకు వొచ్చినరోజులు, తన మాట వినేటప్పటికే ఆమె ఉప్పొంగిపోయిన ఘడియలు, తన్నామె స్పృశిం చిన మాత్రాన తన దేహమంతా తన మనస్సంతా విద్యుత్తరంగాలు ముంచి వేసిన శుభముహూర్తాలూ ఇప్పుడు అర్థంలేనివై పోవలసిందేనా?"

5

"నాన్నగారూ! నేను వ్యవసాయం చెయ్యాలని సరదా పుట్టింది. మన మెరకపొలంలో రెండెకరాలు నాకివ్వండి. అందులో మంచి తోట వెయ్యాలని వుంది" అని తండ్రి నడిగాడు శ్యామలరావు.

శ్యామలరావు వూరు బెజవాడ బందరు రోడ్డు ప్రక్క కంకిపాడుకి ఇవతలనున్న ఇందుపల్లి గ్రామం. శ్యామలరావు తండి సుబ్బయ్యగారు కుమారుణ్ని చూసి "అబ్బాయీ! వ్యవసాయం యేమిట్రా? రెండు మూడు మంచి ఉద్యోగాలకు వీళ్ళువస్తే అక్కరలేదని తోసేశావు. బెజవాడలో ఏదో కాలేజీ పెట్టానన్నావు, నీకు నిమిషాని కో ఆలోచన. మనస్సు నిలకడ లేదా యెను" అని కొంచెం కోపంగా అన్నారు.

"మీరు గట్టిగా వొద్దంటే మానేస్తాను నాన్నా! నాకోర్కె ప్రతీదీ మీరు సంభవించేటట్టు చేశారు. మీ ప్రేమకు ఎప్పుడూ కృతజ్ఞుణ్ని. ఈ ఒక్కకోరికా తీర్చండి. ఈ కోర్కెకూ, నా జీవితానికి చాలా సంబంధం వుంది."

"అబ్బాయీ! తోటవేయడమంటే చాలా డబ్బు ఖర్చౌతుంది."

"ఏదో కొద్దిఖర్చుతో తోటవేయాలని వుందండీ మనకున్న స్థితిలో మన కుటుంబాలకు డబ్బు కష్టసాధ్యమే. చదువుకోసం మీరు పంపించిన రూపాయలలో కొన్ని ఖర్చుచేయకుండా బ్యాంకులో ఉంచాను. అదే నానాగలి దున్నటానికి పెట్టుబడి."

"నాన్నా! నీ ఆరోగ్యం అంత బండరకపుదికాదురా! ఈ బండపనిలో ఎందుకూ పనికిరాకుండాపోతావు. సందేహంలేదు."

"డాక్టర్లు, దేశనాయకులూ మళ్ళీ భూమాత పాదాలకడకుచేరండి. దేశ సౌభాగ్యమూ ఆరోగ్య సౌభాగ్యమూ. అక్కడే ఉన్నది' అంటున్నారండి నాన్నగారూ!"

"ఉల్లికోడుపొలం నూతిదగ్గర ఒకయకరం దొడ్డికిచుట్టూ వెదురుకంచె కట్టమంటాను వెంకన్నని. మొదలెట్టు ఇదో మూన్నాళ్ళ ముచ్చట. తర్వాత నేను చెప్పలేదనిమాత్రం అనకు."

ఉల్లికోడుపొలంలో యెకరంతోట విభాగించారు. ఆ తోటలో నాగేటి చాలు నవ్వింది. బెజవాడ ముష్టివారి దుర్గానర్సరీనుండి అంట్లూ విత్తులూ బళ్ల మీదవొచ్చి తోటంతా ముట్టడించాయి. అద్దెకు తీసుకు వచ్చిన మోటారు పంపు అమిత వేగంతో పాతాళగంగాగానాన్ని శ్యామలుని కంఠానికి శ్రుతి కలిపింది —

తోటకూర, గోంగూర, మెంతికూర, కొత్తిమీర మళ్ళు ఒకప్రక్కన. కాబేజీ, కాలీ, ముల్లంగి, కారెటు విత్తనాల మళ్లొకప్రక్క పచ్చని మొక్కలతో పకపకమన్నాయి. మామిళ్ళు, సపోటాలు, తీపినిమ్మలు, బత్తాయిలు, నిమ్మలు బలమైన అంట్లు బారులుతీర్చినవి. బొప్పాసి మొక్కలు, కొబ్బరి మొక్కలు తోటచుట్టూ కంచెపక్కనే కాపలాకాస్తున్నవి. ఒక మడిలో ముప్పై రకాల గులాబీలు, కేర్లయిన్‌డి ఆర్డెన్, పాల్నెరాన్, తెల్ల అమెరికనుసుందరి పువ్వులతో అలంకరించుకొని గాలిలో నృత్యాలు సల్పు తున్నది.

మూడు నెలలు ఒళ్ళు తెలియకుండ స్వర్ణకుమారిపేరు మంత్రంకాగా

శ్యామలుడు ఆరోగ్యం అంతా హూనం చేసుకున్నాడు. ఆతని చిత్రలేఖనం బొగ్గైనవిర్లాలలో, ఆతని కవిత్వం తీగెసంపెంగలో, ఆతని మధురకంఠం మాలతీ మాధవీ లతలలో రంగులుదాల్చి ఛందోగతుల నడిచి తాళగతియై ప్రసరించిపోయినవి.

పెద్దపాలి వెంకన్న ఎంతో సాయముచేశాడు. పలుచని సున్నితమైన ఆతనిశరీరము తన పాత బంగారుఛాయ త్రోసిపుచ్చుకొని కఠ్రపడి నల్ల బడి పోయింది. ఆతని ఫాలంలోని కాంతీ, కళ్ళల్లోని నృత్యము, పెదవుల్లోని హాసము మటుమాయమైపోయి నాగేటివాళ్ళకు ఎరువుగ రాలినవి.

6

స్వర్ణకుమారి కనులక్రింద క్రీనీడలు బయలుదేరినవి. అందమైన వంపులు సేకరించుకొన్న—ఆమెపెదవులు తడిరబ్బరుతో చెరిపిన రేఖలులా మరకలు పడినవి. కొద్ది వంపుతిరిగిన ఆమె చిత్రమైన ముక్కు సన్నగించి నిజముగ శుకనాశికమైనది.

శ్రీనివాసరావు ఆమె భుజములు రెండు అదిమిపట్టుకొని "చెల్లీ! నీకు మతిలేదు—నాకు పౌరుషంలేదు. మనిద్దరికీ బుద్ధిలేదు. నీ వీ సుబ్రహ్మణ్యాన్ని పెండ్లి చేసుకుందామనేనా? నాన్నా అమ్మా దగ్గరనుంచి నీకిష్టమైతే సంబంధం వొప్పుకోవన్సునని నాకు మూడుదినాలై వుత్తరం వొచ్చిన సంగతి యెరుగుదువుకదా? అంతభారం నీనెత్తిమీదే పడింది. వాళ్ళమ్మ నన్ను రోజూ అడుగుతోంది. ఏదో జవాబు చెప్పకపోతే నేను వొఠ్ఠి మూర్ఖుణ్ణవుతాను. ఇప్పటికైనా—"

"ఏంచెయ్యమంటావన్నయ్యా! లోకంఅంతా ఆడవాళ్ళని పఘ్నాడ గొట్టాలని ప్రయత్నం చేస్తూనే వుంటుంది. నువ్వుకూడ లోకముతోపాటు వాడివే అయ్యావు. నాన్నా అమ్మా యిచ్చిన అధికారం నీ నెత్తిమీదే పెట్టాను. నువ్వే చెయ్యి."

"ఇదిగో సోనూ! నన్ను పిస్చివాణ్ణి చెయ్యకు. చిన్నప్పటి నుంచీ నువ్వు కొండమీద కోతిని తీసుకువచ్చి యివ్వమంటే తెచ్చియిచ్చాను. నా ఆలోచనలు మగవాడి ఆలోచనలు."

"నేను వొట్టి దద్దమ్మ ఆడదానిని."

"నీకెప్పుడూ సహజంగావుండే నిదానమంతా యేమైపోయింది? మాట్లాడితే తోకతొక్కిన తాచుపాములా లేస్తున్నావు."

"మాటలతో నన్ను బాధించకపోతే ఒక కొరడా తీసుకోరాదు?"

"అయ్యో! వెర్రితల్లీ! నువ్వేది చెయ్యమంటే అదేచేస్తాను. నీ యిష్టంవచ్చినట్టుగ అలోచించుకొని నువ్వు ఆజ్ఞయిస్తే పాలించడం నావంతు. దీనికి మిన్నువొచ్చి మీదపడినా సాలెగూడును దులిపి వేసినట్టు దులిపి వేస్తాను."

స్వర్ణకుమారికి కళ్లు చెమరించినై. "అన్నయ్యా! క్షమించు. నాకు మతిపోతున్నది. సుబ్రహ్మణ్యం తల్లితో సంబంధం ఖాయమని చెప్పు. నాన్నకూ అమ్మకూ ఉత్తరంవ్రాయి—"

"తల్లీ! ఆలోచించుకొని చెప్పమన్నాడు."

"మళ్ళీ మొదలుపెట్టావూ! ఐతే నీయిష్టమే—"

"అబ్బా! ఎంతకోపం వచ్చేస్తుందమ్మా నీకు? ఈ తక్షణం వెళ్ళి సుబ్రహ్మణ్యం తల్లితో చెప్తాను. అమ్మకి నాన్నకి వుత్తరం వ్రాస్తాను. నువ్వు తొందరగా పెట్టించమంటే తొందరగా, ఆలస్యంగా పెట్టించమంటే ఆలస్యంగా ముహూర్తం పెట్టిస్తాను."

"ఎంతతొందరగా ముహూర్తం పెట్టించగలిగితే అంత తొందరగా పెట్టించు. భారత సౌభాగ్యం ఆలోచనలతోనూ, ఆలస్యాలతోనూ వెనక్కుపోతున్నది. ఒక వ్యవసాయదారుని అర్ధాంగిని, హా, హా! హా."

ఆమె వొళ్ళు తెలియనినవ్వు నవ్వుకుంటూ ఆ నవ్వులో విరుచుకుని మూర్ఛలోపడబోయింది. పడబోయే చెల్లెల్ని చివాల్న ఎత్తుకొని రెండంగలలో ఆమెగదిలోకి తీసుకువెళ్ళి మంచంమీద పడుకోబెట్టి, ప్రక్కనున్న కూజాలోని నీళ్ళు ముఖంమీదచల్లి, ప్రక్కలునొక్కి నవ్వాపాడు. ఆమె గజగజ వణికింది.

"శోన్, కంగారు పడకమ్మా! మేమంతా కలిసి నీకు రాక్షసులమయి

నాము. శ్యామసుందరు డొక పంప. ఇదిగో ఈ మందు పుచ్చుకొని పలకకుండా పడుకో. మామూలుగానవౌతావు" అంటూ శ్రీనివాసరావు తనగదిలోకి పరుగెత్తివెళ్ళి తనవద్ద యెప్పుడూ సిద్ధంగావున్న మందులపెట్టె పట్టుకువచ్చి యింత బ్రొమైడు యిచ్చి తల నిమురుతూ ఆమె నిదురబోయే వరకు కూచున్నాడు. బలపూర్ణములయిన సమ్మోహనశక్తిగల ఆతని హస్తతలస్పర్శలో ఆ బాలిక నెమ్మదిచెంది చల్లగా నిద్రాదేవిఒడిలో మైమరచినది.

ఆ సాయంత్రం బండికట్టించి ఐదుమైళ్ళలోవున్న రైలుస్టేషను చేరుకున్నారు అన్నా చెల్లెళ్లు; శ్రీనివాసరావు తన చెల్లెల్ని స్వగ్రామమయిన బెజవాడ తీసుకువెళ్ళాడు.

మూ డ వ భా గ ము

స్వర్ణకుమారితండ్రి తన కుమార్తె సుబ్రహ్మణ్యాన్ని పెండ్లి చేసుకోవటానికి నిశ్చయించుకుందని సుబ్బయ్యగారికి ఇంనుపల్లి ఉత్తరంవ్రాశాడు. ఆ క్రింపటిరోజునే వొంట్లో బాగాలేదని శ్రీనివాసరావు చెల్లెల్ని తీసుకువొచ్చి ఆమె ఆరోగ్యంతో తిరుగుతూ వుండటం చూచి వారంరోజుల్లో వెళ్ళిపోయాడు.

స్వర్ణకుమారికి వచ్చిన అనారోగ్యం విషయంలో సుబ్రహ్మణ్యంనూటే మరచిపోయిన శ్రీనివాసరావు కొంతకాలం మయిందాకా యేమాటా సుబ్రహ్మణ్యంతో తేల్చకూడదని నిశ్చయం చేసుకున్నాడు. ఈ సంగతి స్వర్ణకుమారికి గాని వారితండ్రి రాధాకృష్ణయ్యగారికి గాని తెలియనీయలేదు. అన్నగారీ సంగతి సుబ్రహ్మణ్యముతో చెప్పినట్లే భావించుకొన్నది స్వర్ణకుమారి. ఆమె హృదయంలోనుంచి ఎంత చెరిపి వేసుకుందామనుకున్నా శ్యామలుని చిత్రం మాయంకాదు. నవ్వుతూ నాట్యంచేసే కళ్ళతో పెదవులతో ఆత డామెకు సర్వకాలమూ ప్రత్యక్షమౌతూనే వున్నాడు.

రెండేండ్లనాడు తన పుట్టినరోజుకు అతడు బహూకరించిన 'విశాలభారత' అనే ఉత్కృష్ట చిత్రము తన పడకగదిలో ఎట్టఎదుట గోడకు

వ్రేలాడుతూ వున్నది. రెండెడ్ల బండి కొండలూ పొలాలూ మధ్య పుంతలో వెళ్తూన్నది. బండిపైన బస్తాలమీద చిన్నకుర్రవాడొకడు ధాన్యపు వెన్నులలోని గింజలు తీసుకుని నములుతున్నాడు. కొండలూ, పొలమూ చెట్లయొక్క సౌందర్యము అలవరచుకొన్న బలిష్ఠుడైన రైతు బండి తోలుతున్నాడు. ఆకాశమూ, తీగెలూ, పువ్వులూ, అందాలు పుణికిపుచ్చుకొన్న ఆ రైతుభార్య బండివెనుకనే నెత్తిమీద తట్టతో నడిచి వొస్తూన్నది. దూరాన ఆ లోయలో ఒకవూరు. సూర్యుడస్తమిస్తున్నాడు. ఆకాశంలో పైన తదియనాటి చంద్రవంక. ఈ రెండునూ "విశాలభారత"లోని వృద్ధత్వమూ నవ్యత్వమూ చాటుతూన్నవి. భారతీయ విధానాన్ని చిత్రించిన అద్భుత చిత్రమిది. లక్నో ప్రదర్శనంలో ప్రధమ బహుమతి సందినది.

ఆ చిత్రము దివ్యము. ఆ చిత్రించిన చిత్రకారుడు తనకు దూరమయిపోయాడు. అల్లరివాడు. ఎప్పుడూ తనను నవ్వించేవాడు. అతడు తన జీవితాన్ని ప్రతిఅణువూ స్పృశించి తన కైవశం చేసుకున్నాడు. తానాతని కళ్ళలో కాంతులు పొందింది. అతని నవ్వుల్లో నాట్యమాడింది. "నువ్వు నాకు స్వర్గదేవివి. నీ మందహాస పవిత్రకిరణంలో నా జీవితమూ, నా శక్తి, పుష్టిచేర్చుకుంటవి స్వర్ణసానీ" అని తన్ను ఆతని హృదయాని కద్దుకొన్న గంగానదికడ ఒక దివ్యక్షణ మామెకు స్ఫురణకు వొచ్చింది. ఆ నాడామె పొందిన మహదానందము క్షణికమాత్రమే ఐంది. తన మాటలకే కోపంవచ్చి అతని సహజామృత రసప్రవాహంలో తనకోపం తీర్చక పిరికివానిలా వెళ్ళిపోయాడు.

తాను కోరేది దేశసౌభాగ్యం. దేశసౌభాగ్యాని కాధారం నాగలి. నాగలీ! నువ్వు వేదానివి, నువ్వు పురాణగీతికవు, నువ్వు భగవద్గీతవు, నువ్వు భారతీయ హృదయానివి. నీవల్ల పాశ్చాత్య నీచబావ నీరసంలో పడ్డ మా దుర్బలత్వాన్ని ఏనాటి కానాడు పటాపంచలు చేస్తున్నావు. శ్యామసుందరుడు నాగలి పట్టకపోతేనేమి? నాగలిని కీర్తించే కళాస్రష్టకు తావులేదా ? లలితంగా కుంచె పట్టుకునేచేయి కర్కశంగా మేడితోకను పట్ట

పలసిందేనా? నాగలినీ నాగేటిచాలునీ కీర్తించటము దేశసేవకాదా? శ్యామసుందర్ ! నువ్వేమిచేస్తూవుంటావు. గంగవొడ్డున నీవుచేసిన బాసలు, అన్నగారిపొలంలో నీ దగ్గుత్తిక కంఠం అర్థంలేనివేనా శ్యామం?

2

అనవసరమైన పౌరుషాలకు అవతల, అర్థవత్కృతమైన శాంత కాంతి వెలుగుతూ ఉంటుంది. మనుష్యుని జీవితంలో ఎంత లోతైనా తవ్వి నూతులలో పాతాళగంగా ప్రవాహాలు పారకిస్తాడుగాని తన హృదయంలో కఠినమైన వైరాగం తవ్వుకొని తన ఉత్తమత్వం తాను తెలుసుకోలేడు, తన చెల్లిదాలోటు, తన ప్రాణమిత్రుడు శ్యామలునిదా? ఈరెండు జీవితాలు భగ్నమయితే తాను బాధ్యుడుగాక ఎలాగు? అసలు సత్యానికి దూరమైన వంకరలు భావాలు నిజమని తోస్తే, వాటినేనమ్మి జీవితం భగ్నంచేసుకోవడంలో ఎంత మంది ఆరితేరినారో!

శ్రీనివాసరావుకి వ్యవసాయంపైని మనస్సుపోవటంలేదు. సుబ్రహ్మణ్యం వచ్చి మాట్లాడడమే అపశ్రుతిగాతోచేది. వ్యవసాయమంతా వదిలేసి ఎక్కడికైనా పారిపోవాలనుకొన్నాడు.

* * * *

బెజవాడలో అటూఇటూ తోచక తిరుగుతూ, వ్యవసాయంలో అన్నగారు ఒక్కరూ ఉన్నారు, అక్కడికి ఎందుకు వెళ్ళకూడదా అనుకుంటుంది స్వర్ణకుమారి. అక్కడ ఆ సుబ్రహ్మణ్యం వచ్చి పలుకరిస్తాడు. వెర్రివాడు: పాపం! అతనికేమి తెలుసును, తన హృదయంలోని గాఢమయిన భయంకరమయిన ఈ ఆవేదన? ఆ శ్యామంమీద కోపం కొద్ది ఈతన్ని తన జీవితంలోకి రానిచ్చింది. అవును. అందువల్ల తనతప్పేమి? తన జీవితపథమూ, తన ఆశయాలు: తన స్వప్నాలు గుర్తించలేని ఒక మూఢుడు తన జీవితభాగస్వామి ఎట్లా అవుతాడు! ధైర్యమూ పట్టుదలా గట్టితనమూ లేని నీర

సత్వపు ఆడది అవటంచేత తా నిల్లా బాధపడుతోందిగాని, ధీరస్వభావలగు ఉత్తమ స్త్రీలు ఈ అటు నిటు ఆవేదనలలో అల్లాడి పోనేపోరు.

*   *   *   *

తన వ్యవసాయం ప్రారంభం అయి నాలుగు నెలలయింది. ఈ తోట వేయడంలో ఏమి కొత్తదనం ఉంది?

కళలో సర్వకాల నవ్యత్వముంది. విదానాలు కొత్తవి. కళలో పరిశోధన చెయ్యవచ్చును. 'డావా ఇజమో, ఫ్యూచరిజమో, ఇంప్రెష నిజమో, ఎప్పుడూ కళా ప్రపంచంలో ఉద్భవిస్తూ ఉంటవి.

వ్యవసాయంలో నవ్యత్వం లేదా! ఎప్పటికప్పుడు కొత్త కొత్త రీతులు రావటంలేదా? కృషీవలుడు మాత్రం ఒక రకమయిన కళాస్రష్ట కాడా? కొత్తరకపు పంటలు అనేకులు పండిస్తున్నారు. స్రష్ట అయినవాడు తోటలు వేయడంలో కొత్తరకపు పూలు, పండ్లు ఎప్పటికప్పుడు కల్పించడంలేదా?

కళ మాయ! ఊహా ప్రపంచం మాత్రం వట్టి కల్పన ధరిత్రీ మాతృకృషి సత్యమయినది. అందు వల్ల వచ్చే ఫలితం కళ్ళ ఎదుట మూర్తిస్తుంది.

ఈ ఆలోచనలతో శ్యామలరావు నుదురున చెయ్యిపెట్టుకుని కూర్చున్నాడు. అప్పుడే సుబ్బయ్యగా రాయనదగ్గరకు వచ్చారు.

"నాన్నా! నానాటికి తీసికట్టు నాగంబొట్టు ఔతున్నావురా! ఏమీ తోచ నమ్మ ఏతామెత్తటం ప్రారంభించిందట. డబ్బిచ్చి తద్దినంకొని తెచ్చుకుంటే వేయిచ్చినా వెళ్ళదట; అలా ఉన్నది నీ విషయం. కళ్ళు నూతులై పోయాయి. బొర యెండిపోయింది. రాత్రిళ్ళు దగ్గుతూ వుంటే నా గుండె గుభేల్లు మంటుంది."

"నా వొంట్లో బాగానే వున్నదండీ నాన్నగారూ!"

"ఈ రోజుల్లో పెద్దవారు చెప్పటం చిన్నవాళ్ళు వినడం పోయిందిగా! అంతా జోల్లివిష్టులు. 'మేం చేతుల్తో నడుస్తాము; అది అందం' అంటారు. ఏక్షయమైనా వొచ్చిందంటే నుయ్యో గొయ్యో చూచుకోవాలి మేము. వర

ప్రసాదులాంటి కొడుకని మీ అమ్మ గోలపెట్తోంది. మా కడుపున పుట్టింది నీ వొక్కడవు."

"మీకు చాద స్తమండీ!"

"ఔను మాకు చాద స్తం. నీకు నిదానం. నువ్వెందుకు వ్యవసాయం తీసుకున్నావో నాకు తెలియక పోలేదు. బెజవాడలో రాధాకృష్ణయ్యగారి కుమా ర్తె స్వర్ణకుమారి అన్నగారితోపాటు వ్యవసాయం చెయ్యటానికి కుంత లూరు వెళ్ళింది కదా! ఆ అమ్మాయితోపాటు నువ్వూ ఎందుకు వ్యవసాయం చెయ్యకూడదని నీకు బుద్ధిపుట్టింది."

"నాన్నగారూ! మీ రనవసరంగా నన్ను బాధపెట్టటానికివ్వాళ తలచు కున్నట్టుంది."

"ఓయి వెర్రివాడా ! నేను బాధపెట్టట మేమిటి ? చిన్నతనాన్నుంచీ ఆ అమ్మాయిని నీ కిస్తాననటం, నేనూ రాధాకృష్ణయ్యా ఈవిషయం నిశ్చయించు కోవడం, అందరు పెద్దలు ఆశీర్వదించటం జరిగింది. నువ్వు చదివే కాశీలోనే ఆ అమ్మాయి చదవటం, మీరిద్దరూ ఒకరినొకరు పెండ్లి చేసుకుంటామని ఉవ్విళ్ళూరిపోవటం లోకమంతా ఎరుగును."

శ్యామలుడు మౌనం.

"నెలరోజుల క్రిందట ఆయన ఓ ఉత్తరం వ్రాశాడు. వాళ్ళమ్మాయి స్వర్ణకుమారి శ్రీనివాసరావుతోపాటు వ్యవసాయం చేస్తూన్న ఒక అబ్బాయిని పెండ్లి చేసుకోవడానికి నిశ్చయించుకుందనీ, తన కుమా ర్తె గట్టిపట్టుపట్టడం చేత తాము ఆమోదించవలసి వచ్చిందనీ, తన్ను క్షమించవలసిందని ఆయన వ్రాశారు. నీ మనస్సు బాధపడి పోతుందని నీ కప్పుడా వుత్తరం చూప లేదు."

శ్యామలుని మోము వివర్ణం చెందింది. నీరసించి వున్న శ్యామలుడు తల దిమ్మెపట్టి ఫెళ్ళున విరుచుకొని పడిపోయాడు. "నాయినా !" అంటూ కొడుకును రెండు చేతులతో యెత్తి మంచంమీద పడుకోబెట్టి సుబ్బయ్యగారు "ఏమే, నీళ్ళే" అని కేకపెట్టాడు. "ఏమిటండీ! ఏమిటండీ!" అంటూ తల్లి

కంగారుపడుతూ వచ్చింది. మంచంమీద శవంలా పడివున్న కొడుకును చూచి "ఓయి నాయనో, అమ్మో" అని కేకలుపెట్టింది.

"నోరుమూసుకో! వాడిప్రాణం కడగట్టింది. పరుగెత్తుకువెళ్ళి డాక్టరుగారిని అర్జంటుగా రమ్మని కబురు పంపించు" అని సుబ్బయ్యగారు కొడుకు మొహంమీద నీళ్ళు గట్టిగచల్లి కుమారుడి నాడి పరిశీలిస్తూ అతని మోహం వంక పారచూచి కళ్లు చెమరించటంవల్ల పైమీద కండువాతో ఎడమచేత్తో కళ్ళు తుడుచుకున్నాడు.

3

శ్యామలరావు కళ్ళు తెరిచాడు. తల్లివంక మొహం తిప్పి "ఏమీ లేదమ్మా! కంగారుపడకు!" అని లేవబోయాడు.

తండ్రి "నాయనా! వద్దు" అని వారించి కుమారుని మంచంమీద పడుకోబెట్టాడు. ఇంతట్లో డాక్టరుగారు వొచ్చారు. శ్యామలుని పూర్తిగ పరీక్షచేసి అతి బలహీనతవల్ల గుండె కూడ బలహీనంగా ఉందని,శ్యామలుని నరాలకు దెబ్బ తగిలిందనీ, పూర్తి విశ్రాంతీ, జాగ్రత్తగ వైద్యం చేయటం ముఖ్యమనీ చెప్పి "గ్లూకోజు"మందు ఇంజక్షను ఇచ్చి ఇంటికివెళ్ళి మందులు పంపిస్తానని వాళ్ళందరకు ధైర్యంచెప్పి వెళ్ళాడు.

శ్యామలరావు లేవలేడు. కాళ్ళూ చేతులు సళ్లుకు పోయినవి. అధికాచమాన అల్పాచమానాలు మంచంమీదనే "నీరస! నీరసం! కాఫీ" అని గంట గంటకూ నీరస స్వరంతో అడగడము ప్రారంభించాడు. అతని కేదో అపరిమిత భయం ఉదయించింది. మాట్లాడితే డాక్టర్ను పిలవమంటాడు. డాక్టరు ధైర్యం చెపుతూంటే ధైర్యంగా వుంటాడు.

ఒకసారతనికివేగనాడి (TRACHYCORDIA) ఒకసారతనికి మందనాడి (BRADYCORDIA) ఏమీ ఈప్రాణానికింతకంగారూ? తాను ప్రేమించిన స్వర్ణకుమారి ఇంకో అదృష్టవంతుని జీవితంలో భాగస్వామిని ఔతుంటే భగవంతు డేదో మంచిదారే చూపిస్తున్నాడు. బాధలేకుండ జీవితం మాయమై

పోతే ఆ బాలిక దారి నిష్కంటక మౌతుంది. తాను లోకంలో లేని భావం ఆమెకు తోచినప్పుడు తన కోసం ఒకసారైనా విచారించకుండా వుంటుందా? ఈ ప్రేమ కాశించడం తుచ్ఛమా! పురుషునికి స్త్రీమీదనూ స్త్రీకి పురుషుని మీదనూ వుండే ప్రేమే జీవితంలోకల్లా ఉత్కృష్టమైన ప్రేమ. ఆ ప్రేమ నిష్కల్మషమైతే భగవంతునిమీద ప్రేమే ఔతుంది. ప్రేమ -జీవితం భగ్నం చేసి పెట్టుకోడానికి తెచ్చిపెట్టుకున్న విషం! బంగారపు గిన్నెతో నింపుకొని తాను తాగుతూన్నాడు—వ్యవసాయం—కళలు, ప్రేమ—

డాక్టరుకి శ్యామలరావు సంగతి చూస్తే కొంచెం భయమే వేసింది. మదరాసో, విశాఖపట్టణమో తీసుకెళ్ళితే ఉత్తమమని సుబ్బయ్యగారికి సలహా చెప్పాడు. తానుకూడా వస్తానన్నాడు. సుబ్బయ్యగారు కొడుకుతో నెమ్మదిగ "నాన్నా! విశాఖపట్నం వెళ్దాంరా" అన్నాడు.

నీరస కంఠధ్వనితో శ్యామలుడు "ఏమీ జబ్బులేదండీ! రెండురోజుల్లో నెమ్మదిస్తుంది" అని అన్నాడు. కుమారుని కంఠంలోని నిస్పృహా,హృదయం లోని బాధా సుబ్బయ్యగారు కనిపెట్టకపోలేదు.

"నాన్నా నీ యిష్టం వచ్చినపని చేసుకో! నీకు కావలసిన డబ్బిస్తాను. వెంగపెట్టుకోకు. అనవసరమైన హృదయంలోని బాధ నిన్ను క్రుంగదీయుట అటు వుంచగా కడుపున పుట్టిన నీవొక్కడమీదా ఆధారపడి వున్న నన్నూ, మీ అమ్మనీ మహా బాధా నరక కూపాల్లో పడవేస్తుంది. నా జన్మంతా నీ మీదే ఆధారపడి వున్నది. ధైర్యం తెచ్చుకొని నన్ను రక్షించుకో!"

తన హృదయంలోని బాధతోపాటు, తండ్రిగారి బాధ కూడా శ్యామ సుందరునకు జబ్బును ఇబ్బడి చేసింది.

ఆనాడు అతి ఆవేశంతో సుబ్బయ్యగారు పెద్ద వుత్తరం వ్రాసి రాధా కృష్ణయ్యగారికి బెజవాడ పంపించారు.

4

వెళ్ళిన దగ్గరనుంచి అన్నగారి దగ్గరనుండి వుత్తరాలే లేవని స్వర్ణ కుమారి ఆలోచించుకుంటూ ఒక ఇంగ్లీషు నవల చదువుకొంటోంది. రాధా

కృష్ణయ్యగారు కూతురు దగ్గరకు వచ్చి "స్వర్ణా! మీ చదువులన్నీ మా పెద్ద వాళ్ళ ప్రాణాంతకాలైనాయి" అని అన్నారు.

"ఏమిటండీ నాన్నగారూ ! మీరు గూడ మా చదువులమీదే కత్తి కట్టారా! నేను చదువుకుంటానని ముచ్చటపడితే మీకు చెప్పించమని ఎక్కడ వుంది?"

"అవును, నా నెత్తిమీదకుండ నేనే బోర్లించుకున్నానులే."

"అలా మాటలాడుతున్నారేమిటండీ నాన్నగారూ !"

"ఏమీలేదు; ఇందుపల్లినుంచి వుత్తరం వచ్చింది."

స్వర్ణకుమారి మౌనము.

"నాకేమిచేయాలో తోచకుండా వున్నది."

"శ్యామలరావు తండ్రి సుబ్బయ్యగారు వ్రాశారు."

స్వర్ణకుమారి తల వంచుకొని కాలి బొటన వ్రేలితో నేల రాస్తూన్నది.

"శ్యామలునికి చాల జబ్బుగ వుందిట!"

"ఏమిటండీ!"

"కుంతలూరునుంచి వొచ్చినప్పటినుంచీ శ్యామలరావు వ్యవసాయం ప్రారంభించాట్ట! చిక్కి శల్యమైపోయాట్ట, తండ్రి ఎంత చెప్పినా వినలేదట. నేను వెనక సుబ్బయ్యగారికి నువ్వు సుబ్రహ్మణ్యాన్ని పెళ్ళి చేసుకుండే విషయం వుత్తరం వ్రాశాను. ఆ సంగతి యిన్నాళ్ళదాకా కొడుకుతో చెప్పకుండ మూడురోజులక్రిందట, తండ్రి శ్యామలరావుతో చెప్పాట్ట. ఆవార్త వినటంతోనే శ్యామలుడు విరుచుకుపడిపోయాట్ట."

"ఎలావుందండీ !"

"డాక్టరు వైద్యం చేస్తున్నాడట! విశాఖపట్టణం తీసుకు వెడదామని అనుకుంటూన్నారట. మీ యిద్దరి చిన్నతనంలో నేనిచ్చినమాట జ్ఞాపకం చేసుకోవలసిందని సుబ్బయ్యగారు వ్రాశారు."

"నాన్నా, మీరు కారు మాటాడించి ఇందుపల్లి ప్రయాణం కండి.

అమ్మా, మీరూ, నేనూ తత్ క్షణం బయలుదేరి వెళ్ళాలి. అన్నయ్యకీ శ్యామలరావుకీ స్నేహితుడు ఈ వూళ్లో డాక్టరు జగన్నాధరావుగా రున్నారే ఆయన్నికూడ తీసుకు వెడదాం అన్నయ్యని తత్ క్షణం రమ్మని ఉత్తరం వ్రాసి ఇందుపల్లి నుంచి వొచ్చిన ఉత్తరం జతపర్చి మనిషికిచ్చి పంపండి" అని కన్నీళ్ళతో కంగారుతో బట్టలు సర్దుకొంటోంది. రాధాకృష్ణయ్యగారు వినవిన వెళ్ళిపోయారు.

స్వర్ణకుమారి హృదయంలో "కాశీవిశ్వేశ్వరా! నీ సాక్షిగా మే మిద్దరం ప్రేమ ప్రతిజ్ఞ తీసుకున్నాము. నా శ్యామలుని రక్షించు. మే మిద్దరం కలిసి నీ దగ్గరకు వస్తాము, తండ్రీ" అని ఏడ్చినది. ఆమె కన్నులూ ఏడ్చినవి.

5

ఏదో నల్లని మత్తుకలలతో, మండే బాధతో ఈతకందని లోతులుగల నీరసంతో "అమ్మా" అంటూ ఓ మాటు తల్లిని కాళ్ళు పిసకమంటాడు. ఓ మాటు వొద్దంటాడు శ్యామం.

శ్యామలుడు ఆ అతినీరసములోనే ఏదో కారు చప్పుడు విన్నాడు. ఇంతటిలో డాక్టరుగారు వొస్తున్నారని సుబ్బయ్యగారు వచ్చి కొడుకుతో చెప్పాడు.

"న....రే.... లెండీ........" అని శ్యామలుడు కళ్లు తెరిచాడు.

డాక్టరు విశ్వనాధంగారు డాక్టరు జగన్నాధరావుతో గది గుమ్మంవద్ద ప్రత్యక్షమయ్యాడు. జగన్నాధరావు గది గుమ్మంనుండి లోపలికి గబగబ వచ్చి "ఏమిరా, శ్యామ్! మహా మొనగాడ వయ్యావుట! నీ స్నేహం యేడ్చినట్టే వుంది. కాస్త కబురు పంపకూడదు కాబోలు! ఏదీ, చెయ్యేదీ!"

జగన్నాధరావు చిన్నతనంలోనే ప్రసిద్ధి సంపాదించుకున్న డాక్టరు.

శ్యామలునికన్న నాలుగేళ్ళు పెద్ద. శ్యామలుని గుండె బాగా పరీక్షచేశాడు. రక్తపుపోటు యంత్రంతో ముంజేతినాడి పరీక్ష చేశాడు.

"గుండెలో జబ్బేమీలేదు. నరసీరసత్వమూ, బెంగా తప్ప ఏమీలేదు. పదిరోజులపాటు నా దగ్గర వుండటము, నాతో సినిమాలకు రావడము నే నివ్వాళ నాతో తీసుకువచ్చిన మంచి నర్సు చేతుల్లో ఉపచారంపొందటము ఇదీ వీడికి వైద్యము. ఒరే శ్యామ్! ఈ నర్సుని చూశావా! చాలా ప్రజ్ఞావంతురాలు. నువ్వెరుగున్నమ్మాయేట. జనరల్ ఆస్పటలులో నర్సుల చేతిలో ఎప్పుడూ పడలేదు కాబోలు!"

శ్యామలుడు ఆనందము, బాధ సమ్మిళితమయ్యే నవ్వుతో స్నేహితుని అరచెయ్యి తన ముఖానికి అద్దుకున్నాడు.

"ఒరే శ్యామ్! మా నర్సు చాల అందమైనది సుమా! జాగ్రత్తగా వుండు, లేకపోతే నాకు ఈర్ష్యవొస్తుందిసుమా!"

"నీ మొహం! ఎప్పుడూ ఇలాంటి మాటలే" అని నవ్వుతూ అన్నాడు శ్యామలుడు. ఆ నీరసత్వంలో బలం కలుగుతున్న ఛాయలా వున్నవి.

"నువ్వు కంగారు పడకపోతే ఆ అమ్మాయి ఎవ్వరో చెప్తాను."

"నాకు నర్సెందుకురా!" మాట యింకా దిటవుగా వున్నది.

"ఈ రోజుల్లో జబ్బులకి నర్సులు లేకపోతే లాభంలేదు. అంచేత ఆ నర్సుపేరు చెప్తున్నాను. ఆమె పేరు బంగారం!"

శ్యామసుందరుని కళ్ళు మెరిసినవి. ఆతని గుండె దడదడ కొట్టుకున్నది. శ్యామసుందరుని చేయి తన చేతితో పట్టుకుని నాడిపై వ్రేళ్ళు యింతవరకూ వుంచివున్న జగన్నాధరావు.

"ఒరే! నాడి ఎంతవేగంగా కొట్టుకొంటోంది. తగ్గు తగ్గు. అబ్బా! ఏమి సంతోషమండీ, మా వాడికి బంగారు నగలు చూట్టం, బంగారు రంగులు చూట్టం మా యిష్టం! ఈ నర్సు పేరు వొట్టి బంగారం కాదురోయి, బంగారపు కుమార్తె, స్వర్ణకుమారీదేవి. సుబ్బయ్యగారూ! ఆ నర్సు

నిలా పిలవండి!" గుమ్మం బైటనుండీ ఈ మాటలన్నీ వింటూన్న స్వర్ణ కుమారి చిరునవ్వు నవ్వుకుంటూ గదిలోనికి వచ్చింది. స్వర్ణకుమారి చూపులూ, శ్యామసుందరుని చూపులూ జగత్సర్వమూ మరచి ఒక దానిలో ఒకటి లీనమైపోయాయి.

"మా నర్సుని చూస్తేనే నాడి బాగా ఇంప్రూవైందే; ఆవిడ పరిచర్యచేస్తే రేపే లేచి నడుస్తాడు. నీ డ్యూటీలో చేరమ్మా, నర్సూ!"

ఇంతట్లో రాధాకృష్ణయ్యగారు, స్వర్ణకుమారి తల్లి మహాలక్ష్మమ్మ గారు లోపలికి వొచ్చారు.

రాధాకృష్ణయ్యగారు, "ఏమోయ్ శ్యామం! జగన్నాధరావు రేపు ప్రొద్దున్నే మనమంతా బెజవాడ వెళ్ళాలని దారిలో చెప్పాడు. నీ వెనకటి మిసిమిదనం వొచ్చేవరకూ మా యింటిలో వుండాలి సుమా! తర్వాత నీ యిష్టం ముహూర్తానికి తరలి వచ్చేవరకూ మా యింటికి వచ్చినా సరే, లేకపోయినా సరే!"

ఆ రాత్రికి శ్రీనివాసరావు వచ్చాడు. శ్రీనివాసరావు, జగన్నాధ రావు, శ్యామలరావు ఉత్తమ స్నేహానందంలో తరంగాలులా పైకుబికారు. సుబ్రహ్మణ్యానికి మాట యివ్వలేదని వారందరితో చెప్పాడు శ్రీనివాసరావు. ఈ ఆనందంలో నీరసంమాట మరచిపోయి శ్యామలరావు కూర్చునే మాట్లాడుతూన్నాడు. స్వర్ణ దివ్యదేవతలా పడుకోమంటూ శ్యామలుని కేకలువేస్తూ అతని ఫాలంపై హస్తతలంవేస్తూ తన నర్సుపని బాగా చేస్తూన్నది.

మర్నాడు ఉదయం శ్యామలరావు గదిలోనికి నవ్వుతూ ఆతని నర్సు కాఫీ మందూ పట్టుకు వచ్చింది.

"శ్యామ్! మందు పుచ్చుకొన్ని, కాఫీ పుచ్చుకో."

"నువ్వు రావటమే మందు."

"పొద్దున్నే అన్నయ్య నువ్వు వేసినతోట చూసి వచ్చాడు. నా కోసమే ఆ తోట వేశావు! నీ ప్రేమంతా ఆ తోటలోనే అన్నయ్యకు కన్పడిందట. నీ ప్రేమకు నేను పాత్రురాల నౌతానా శ్యామ్!"

"ఇలారా సొన్నసానీ! నా గుండెలు ఎలాంటి రాగాలు పాడు తున్నాయో విందుగానీ. స్టెథస్కోపుతోకాదు! నీ చెవితోనే విను." ప్రఫుల్లమైన కన్నులతో, మోముతో ఆమె అతని కౌగిలిలో చేరింది.

"మనం ఇద్దరం కాశీ వెళ్ళాలి, నేను మొక్కుకున్నా"

"ఆత్మేశ్వరీ! సొన్నసానీ! నా సొన్నసానీ! కాశీకేకాదు సర్వ దివ్య క్షేత్రాలకు నీతో యాత్రలు సలుపుతాను. ఇది కలే అనుకుంటున్నాను.

"కలా, కళా?"

"సోన్! నిన్ను వదలి ఎల్లా ఉండగలుగుతున్నానో!"

"మనం బెజవాడలో లలిత కళాశాల ఎప్పుడు ప్రారంభించడం?"

"వ్యవసాయంలోని అందం రంగరిస్తూ త్వరలోనే"

శ్యామసుందరుడు ఆమె చెంపలుపట్టి కళ్ళల్లోకి చూసి ఆమె ఫాలం ముద్దుపెట్టుకున్నాడు.